RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 334 పేజీలు - 08 శుక్రవారం 24 అక్టోబర్ 2025

## రూ.79 వేల కోట్లతో రక్షణ కొనుగోళ్లు




**తొలి అక్షరం/న్యూఢిల్లీ అక్టోబర్ 23:** దాదాపు రూ.79 వేల కోట్లతో దేశీయంగా ఆయుధాలు, మిలిటరీ హార్డ్‌ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు రక్షణ శాఖ సిద్ధమవుతున్నది. ప్రతిపాదనలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ వేర్ సింగ్ నేతృత్వంలో గురువారం జరిగిన 'డీఏసీ' సమావేశం ఆమోదముద్ర వేసింది.త్రివిధ దళాలను మరింత బలోపేతం చేసేందుకు గాను సరికొత్త మిస్సైల్ వ్యవస్థలను, మిలిటరీ వాహనాలను, నౌకల్లో ఉపయోగించే గన్స్‌ను, ఇతర మిలిటరీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

# ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం..

- ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలున్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులే!
- పంచాయతీరాజ్ చట్టంలో కీలక సవరణ దిశగా రేవంత్ సర్కారు
- ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణకు ఆమోదం
- త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం






**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:**తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు.కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఈ బిల్లును ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు మిగతాది 2లో...

# అందరూ కలసికట్టుగా ప్రచారం చేయండి



- భారీ మెజార్టీతో.. సునీత గెలవాలి
- వచ్చే 15 రోజులు కీలకం
- ఎర్రవల్లి ఫామ్ హౌస్లో కీలకనేతలతో భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం వ్యూహంపై చర్చ

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:**

రాబోయే 15 రోజులే కీలకమ ని, నేతలందరూ అందర్శిన మన్వయం చేసుకుంటే ఎన్నికల ప్రచారాన్ని తీవ్రతరం చేయాలని గులాబీ దళపతి కేసీఆర్ పార్టీ నేతలకు సూచించారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేప థ్యంతో కేసీఆర్ ఎర్రవల్లిలో పలువురు పార్టీ నేతలతో గురువారం సమావేశమ య్యారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాక రావు.మిగతాది 2లో...

## వీడిన ఉత్కంఠ..

### బీహార్ మహాకూటమి

### ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్



- సీట్ల పంపకాలపై ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య వీడిన ప్రతిష్టంభన
- రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ అధికారిక ప్రకటన
- కూటమిలో ఆర్జేడీకి 143 అసెంబ్లీ స్థానాలు ఖరారు
- డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరు ప్రకటన
- కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యంతో వివాదానికి తెర

**తొలి అక్షరం/న్యూఢిల్లీ అక్టోబర్ 23:** బీహార్ రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష 'మహాఘటబంధన్' (మహా కూటమి) తన ముఖ్యమంత్రి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించింది. ఆర్జేడీ యువనేత తేజస్వి యాదవ్ నాయకత్వంలోనే కూటమి ఎన్నికల బరిలోకి దిగనుందని స్పష్టం చేసింది.

మిగతా 2లో..

# రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

- ఎవరికీ వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు
- కాంగ్రెస్ అవినీతిలో అధికారులు భాగస్వామ్యం కావొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:** సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం సెటిల్‌మెంట్లు తప్ప ఏమీ నడవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదు. మిగతా 2లో...

## గ్రూప్-1 పరీక్షను రద్దు చేయించండి

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ

### నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించారని ఆరోపణ



2లో


## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

### ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు మిగతా 2లో..

# మంత్రితో వివాదం.



## - తెలంగాణ ఐఏఎస్ రాజీనామా


- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ
- మంత్రి జూపల్లి కృష్ణారావుతో లిక్కర్ హెూలోగ్రామ్ టెండర్లపై తీవ్ర విభేదాలు
- రిజ్వీ వీఆర్ఎస్‌ను తిరస్కరించాలంటూ సీఎస్‌కు మంత్రి జూపల్లి లేఖ
- మంత్రి అభ్యంతరాలను పట్టించుకోకుండా వీఆర్ఎస్‌ను ఆమోదించిన ప్రభుత్వం
- రిజ్వీ స్థానంలో ఎం. రఘునందన్ రావుకు పూర్తి అదనపు బాధ్యతలు

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:** తెలంగాణ ప్రభుత్వంలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారికి, మంత్రికి మధ్య జరిగిన తీవ్ర వివాదం ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు (వీఆర్ఎస్) దారితీసింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో తలెత్తిన విభేదాల కారణంగా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ బుధవారం తన పదవికి వీఆర్ఎస్ తీసుకున్నారు. నిజాయతీపరుడైన అధికారిగా పేరున్న రిజ్వీ, వ్యక్తిగత కారణాలతోనే పదవీ విరమణ చేస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ, మిగతా 2లో..

## నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్..

### మారనున్న బ్యాంకు నిబంధనలు ఇవే!

- నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త బ్యాంకింగ్ నామినేషన్ నిబంధనలు
- ఖాతాదారులు నలుగురి వరకు నామినీలను నియమించుకునే అవకాశం
- నామినీలకు ఎంత వాటా ఇవ్వాలో కూడా నిర్ణయించుకునే వెసులుబాటు



2లో

# తక్షణ సహాయ చర్యలు

- వర్ష ప్రభావిత జిల్లాలకు నిధుల విడుదల...
- దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు
- అక్కడి నుంచే భారీ వర్షాలపై సమీక్ష
- తక్షణమే విడుదల చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రులు, సీఎస్, కలెక్టర్లతో సీఎం టెలీకాన్ఫరెన్స్



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:**రాష్ట్రంలో పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ పాలనను పరుగులు పెట్టించారు. దుబాయ్ నుంచే ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తక్షణ సహాయక చర్యలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మిగతా 2లో..

# మంత్రితో వివాదం... ఉద్యోగానికి తెలంగాణ ఐఏఎస్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

దీని వెనుక లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ల వివాదం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**వీఆర్ఎస్‌ను అడ్డుకోవాలని మంత్రి ప్రయత్నం**

మద్యం సీసాలపై అతికించే హై-సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల టెండర్ల ప్రక్రియను రిజ్వీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. దీనివల్ల పాత వెండర్‌కే ప్రయోజనం చేకూరిందని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంలో రిజ్వీ తీరు తీవ్ర తప్పిదమని, క్రిమినల్ చర్యలకు ఆస్కారం ఉందని పేర్కొంటూ, ఆయన వీఆర్ఎస్ దరఖాస్తును తిరస్కరించాలని కోరుతూ మంత్రి జూపల్లి స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) బుధవారం లేఖ రాయడం కలకలం రేపింది. అయితే, ప్రభుత్వం మంత్రి అభ్యంతరాలను పక్కనపెట్టి రిజ్వీ వీఆర్ఎస్‌ను ఆమోదించింది. ఆయన స్థానంలో వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం. రఘునందన్ రావుకు రెవెన్యూ (వాణిజ్య పన్నులు %ఌ% ఎక్సైజ్) శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

**వివాదానికి నేపథ్యం ఇదే**

నకిలీ మద్యం, అక్రమ రవాణా, ఎక్సైజ్ పన్ను ఎగవేతను అరికట్టేందుకు హోలోగ్రామ్‌లు కీలకం. వీటి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని గత ఏడాది ఆగస్టు నుంచే తాను రిజ్వీకి సూచిస్తున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. అయితే, సెప్టెంబర్‌లో రిజ్వీ టెండర్ల నిపుణుల కమిటీని పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించడమే కాకుండా, ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ ప్రతిపాదనను మంత్రి తిరస్కరించినా, రిజ్వీ ఆ ఫైలును మంత్రిని కాదని నేరుగా ముఖ్యమంత్రికి పంపడంతో వివాదం ముదిరింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 23 కంపెనీలు బిడ్లు దాఖలు చేసినా టెండర్ల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో, ఈ ప్రతిష్టంభన నడుమ రిజ్వీ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

**రాజకీయ రంగు పులుముకున్న వివాదం**

ఈ పరిణామంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు అవినీతి సొమ్ము పంపకాల విషయంలో గొడవ పడుతున్నారని, దానికి అధికారులు భాగస్వాములు కాకపోవడంతో వారిని వేధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంత్రి జూపల్లి చెప్పిన మాట వినలేదన్న కోపంతోనే రిజ్వీ వీఆర్ఎస్‌ను కూడా అడ్డుకోవాలని చూశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అక్రమాల్లో భాగస్వాములైతే గతంలో కొందరు అధికారుల మాదిరిగా జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలిసే అధికారులు పదవుల నుంచి తప్పుకుంటున్నారని కేటీఆర్ గురువారం వ్యాఖ్యానించారు.

# గ్రూప్-1 పరీక్షను రద్దు చేయించండి

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:** తెలంగాణలో ఇటీవలే నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్న గ్రూప్-1 పరీక్షపై తీవ్ర దుమారం రేగింది. ఈ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం సంచలనంగా మారింది. గ్రూప్-1 నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని, రాష్ట్రపతి ఉత్తర్వులను సైతం ఉల్లంఘించారని ఆమె తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని కవిత తన లేఖ ద్వారా సీజేఐని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితమే హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 562 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన నేపథ్యంలో కవిత ఫిర్యాదు ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు కవిత వెల్లడించారు. ప్రశ్నాపత్రాల అనువాదంలో (ట్రాన్స్‌లేషన్) లోపాల వల్ల ప్రొఫెసర్లు, లెక్చరర్లు సమాధాన పత్రాలను సరిగ్గా మూల్యాంకనం చేయలేకపోయారని, దీంతో మార్కుల్లో భారీ వ్యత్యాసాలు వచ్చాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ఆమె తెలిపారు. అంతేకాకుండా, ప్రిలిమ్స్ పరీక్షకు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్ పరీక్షకు మరో హాల్ టికెట్ నంబర్ కేటాయించడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరిపి, గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# బీహార్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

పాట్నాలోని మౌర్య హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి భాగస్వామ్య పక్షాల నేతల సమక్షంలో ఈ కీలక ప్రకటన వెలువడింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, బీహార్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ అశోక్ గెహ్లాట్.. తేజస్వి యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తూ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరును కూడా ఆయన ఖరారు చేశారు.

“తేజస్వి యాదవ్ ఒక యువ నాయకుడు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి. ఆయనకు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు ఉంది. అందుకే, ఆయన నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మేమంతా నిర్ణయించాం” అని అశోక్ గెహ్లాట్ ఈ సందర్భంగా తెలిపారు.

సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. 2020 ఎన్నికల్లో కేవలం 19 సీట్లు గెలిచినప్పటికీ, ఈసారి కూడా తమకు 70 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, కాంగ్రెస్ గత ప్రదర్శన దృష్ట్యా అన్ని సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సుముఖత చూపలేదు. దీంతో కూటమిలో ప్రతిష్టంభన ఏర్పడింది.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది. సమస్య పరిష్కార బాధ్యతను అశోక్ గెహ్లాట్‌కు అప్పగించింది. బుధవారం పాట్నాకు చేరుకున్న ఆయన.. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌లతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల ఫలితంగానే కూటమిలోని అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, అందరం కలిసికట్టుగా ఎన్నికల్లో పోరాడతామని గెహ్లాట్ ప్రకటించారు.

తాజా ఒప్పందం ప్రకారం, ఆర్జేడీ 143 స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ నిర్ణయంతో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయేను ఎదుర్కొనేందుకు మహాకూటమి ఐక్యంగా సిద్ధమైనట్టయింది. ఈ పరిణామం కూటమి ప్రచారానికి కొత్త ఊపునిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తక్షణ సహాయ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, సంబంధిత మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్షాల తీవ్రత ఎక్కువగా ఉన్న నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు తక్షణ సహాయక చర్యల కోసం రూ. 2 కోట్ల చొప్పున అత్యవసర నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. మిగిలిన వర్ష ప్రభావిత జిల్లాలకు కూడా రూ. 1 కోటి చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు, కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు రాష్ట్ర విపత్తు స్పందన దళాలను (ఎస్డీఆర్ఎఫ్) వెంటనే తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు. నెల్లూరు జిల్లాలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జాతీయ విపత్తు స్పందన దళాలను (ఎన్డీఆర్ఎఫ్) కూడా రంగంలోకి దించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

# అందరూ కలసికట్టుగా ప్రచారం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సునీతా లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు. ఎమ్మెల్సీలు, కీలక నేతలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కేసీఆర్ వారితో చర్చించారు. ప్రస్తుతం స్తుతం నియోజ నియోజకవర్గంలో నెలకొన్న పరి ణామాలు, చేరికలు, ప్రచార శైలి తదితర అంశాలు చర్చించారు. కొన్ని రోజులుగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు నియో జకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కొత్తగా పార్టీలో చేరికలు, ప్రచార వ్యూహం తదితర అంశాలను కెసిఆర్ కు నేతలు వివరించారు. **ప్రచారం ఉధృతం చేయాలి..** ఈ సందర్భంగా కేసీఆర్ ఎన్నికల గడువు దగ్గరపడుతున్నందున ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నందున, ఆ ప్రభావం ఉప ఎన్నిక ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇకపై ప్రచారం, పోలింగ్ రోజు వ్యూహం, బూత్ మేనేజ్ మెంట్ వంటి అంశాలపై ముఖ్య నేతలకు కేసీఆర్ గా దిశానిర్దేశం చేశారు. ఇది ఇలా ఉంటే మాగంటి గోపీనాథ్ మరణంతో జరుగుతున్న ఉప ఎన్నిక లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా ఆయన సతీమణి సునీత పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. గత కొద్దిరోజులుగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు జూబ్లీహిల్స్ లో ప్రచారం చేస్తున్నారు.

# ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కూడా పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. కాగా, 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా మారారు. 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఏపీ నుంచి తెలంగాణ విడిపోయాక 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఇద్దరు పిల్లల నిబంధనను టచ్ చేయలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. 2024 డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించలేదు. తాజాగా ఇవాళ జరిగిన కేబినెట్..పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేతకు ఆమోదం తెలిపింది.

# గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. జీడీపీలో తెలంగాణ వాటా 5శాతం, గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర జీఎస్డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ. 3.2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం” అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, అప్పుడు రోహిన్ రెడ్డి బెదిరించారని, తుపాకీ రేవంత్ రెడ్డే ఇచ్చిండని మంత్రి కుమార్తె చెప్పారన్నారు. ముఖ్యమంత్రే తుపాకీ ఇచ్చి పంపించాడని ఆరోపణ చేసినప్పుడు, సీఎం సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపైన స్పందించాలని డిమాండ్‌చేశారు. రేవంత్ రెడ్డి వంటి బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని, స్వయంగా నీపైన మంత్రి బిడ్డే ఆరోపణలు చేస్తే ఆ మంత్రినీ పక్కకు జరపలేవు. స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్నా కనీసం వారిని ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి అని ధ్వజమెత్తారు. తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణకు పట్టిన శనిపోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని అన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదంటూ అధికారులు పారిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో ఉందని హెచ్చరించారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి సీనియర్ ఐఏఎస్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు భాగస్వాములు అయితే, అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దా అని మంత్రులు పోటీ పడుతున్నారన్నారు. గన్నులు పెట్టి బెదిరించడంతో ఇందిరమ్మ రాజ్యంలో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. పారిశ్రామికవేత్త నెత్తిన గన్ను పెట్టి బెదిరించారు అని పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రిగారి కుమార్తె ఆపితే.. స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని వెళ్ళిపోయినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు ఎందుకు లేవని నిలదీశారు. రెండు మూడు రోజులపాటు తిట్టుకొని సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి, మంత్రి ఇద్దరు కలిసి శాలువాలు కప్పుకుని స్వీట్లు పంచుకున్నారని మండిపడ్డారు. వాటాల పంచాయితీ, అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ ఇంటి పంచాయతీ లెక్క మారిపోయాయన్నారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, వాటాల పంచాయతీతోనే మంత్రులు బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే.. రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నది? అని ప్రశ్నించారు. పోలీసులు మాత్రం గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ, ఓఎస్డీ సుమంత్ అని చెప్తున్నారని, రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవం. కానీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. మా కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటే గన్నుల బెదిరింపు వ్యవహారంలో చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ అంశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారణ చేసి ఆయన అభిప్రాయాన్ని రికార్డు చేయాలని కోరారు. సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలన్నారు. ఈ మొత్తం గన్నుతో గురిపెట్టిన సంఘటనలో కచ్చితంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు 15 ఎకరాలు, కొండా సురేఖ 15 ఎకరాలు తీసుకొని మొత్తం 30 ఎకరాల భూమి పంచాయితీ పెట్టుకున్నారు మంచిరేవులలో. ఈ భూమి మొత్తం నాకు కావాలంటే, నాకు కావాలి అని మంత్రి, రేవంత్ రెడ్డి, కొండా సురేఖ కొట్లాడుతున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా మొత్తం బయటపెట్టుకొని తిరిగి రాష్ట్రానికి ఏం సందేశం ఇస్తుంది కాంగ్రెస్ పార్టీ?. గతంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుక్కలు చింపిన విస్తరులా చేస్తారు అని. మంత్రులు కాంట్రాక్టులు, కమిషన్ల వ్యవహారాన్ని ఇంటి పంచాయితీగా మార్చారు. పొంగులేటి నా టెండర్లలో తలదూర్చారని మంత్రి కూతురు స్వయంగా చెప్పింది. బెదిరింపులు, టెండర్ల రిగ్గింగు ఇంత బహిరంగంగా దేశ చరిత్రలో ఏనాడు జరగలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేశాను అనే మంత్రి కూతురు చెప్పినప్పుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిచి పోలీసులు విచారించరా?. ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని దక్కన్ సిమెంట్ కంపెనీ యజమానిపైన గన్ను గురిపెట్టినప్పుడు కనీసం ఉత్తమ్ కుమార్ రెడ్డిని, రోహిన్ రెడ్డిని, సుమంత్‌ను ఎవర్ని కూడా పోలీసులు విచారించలేదు. ఇంత దారుణంగా బహిరంగంగా అవినీతి అంశంపైకి వచ్చినా, బెదిరింపులు బయటపడినా బీజేపీ నేతలు స్పందించడం లేదు. తెలంగాణలో బీజేపీ-కాంగ్రెస్ జాయింట్ వెంచర్ పరిపాలన నడుస్తున్నది. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, అమిత్ షా వంటి వాళ్ళు ఎవరు కూడా మాట్లాడడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా మౌనంగా ఉన్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ ఏమాత్రం కాపాడలేదని మేము చెప్తున్నాం. కాంగ్రెస్ పరిపాలనలో పరిపాలన లేదు, ప్రజా పాలన లేదు. కేవలం అరాచకాలు, అవినీతి, బెదిరింపులు, కమీషన్లు, టెండర్ల రిగ్గింగ్ అన్నీ నడుస్తున్నాయి.

# నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్..

**మారనున్న బ్యాంకు నిబంధనలు ఇవే!**

**నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త బ్యాంకింగ్ నామినేషన్ నిబంధనలు**

**ఖాతాదారులు నలుగురి వరకు నామినీలను నియమించుకునే అవకాశం**

**నామినీలకు ఎంత వాటా ఇవ్వాలో కూడా నిర్ణయించుకునే వెసులుబాటు**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 23:** బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. డిపాజిట్ ఖాతాలు, సేఫ్టీ లాకర్లకు సంబంధించిన నామినేషన్ సౌకర్యాలలో కీలక మార్పులు తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, ఖాతాదారులు ఇకపై ఒకరికి బదులుగా గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా నియమించుకోవచ్చు. ఈ కొత్త విధానం నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం 2025లో భాగంగా ఈ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం బ్యాంకు డిపాజిట్లకు నామినీలను రెండు విధాలుగా నియమించుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులు తమకు నచ్చిన విధంగా నలుగురు నామినీలకు ఒకేసారి లేదా ఒకరి తర్వాత మరొకరికి ప్రయోజనం అందేలా ఎంచుకోవచ్చు. అయితే, బ్యాంకుల్లోని సేఫ్ కస్టడీ వస్తువులకు, సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత మరొకరు అనే పద్ధతిలోనే నామినేషన్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది.

ఈ కొత్త విధానంలో మరో ముఖ్యమైన సౌలభ్యం కూడా ఉంది. నలుగురు నామినీలను ఎంచుకున్నప్పుడు, ఎవరికి ఎంత వాటా (శాతం) చెందాలో కూడా ఖాతాదారులే ముందుగా నిర్దేశించవచ్చు. అయితే, మొత్తం వాటాలన్నీ కలిపి 100 శాతానికి సమానంగా ఉండాలి. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు చాలా సులభంగా, పారదర్శకంగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటం, కస్టమర్లకు సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టంలోని సెక్షన్లు 10, 11, 12, 13.. నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.

## ట్రస్మా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేష్ గౌడ్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 23:** ట్రస్మా ఆర్గనైజింగ్ మహబూబాబాద్ జిల్లా సెక్రటరీగా తాళ్లపల్లి రమేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షులు యాకాంతం గౌడ్ తెలిపారు. గతంలో రమేష్ గౌడ్ చేసిన సేవలను గుర్తించి ట్రస్మా సమావేశంలో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.రమేష్ ప్రస్తుతం వికాస్ ఉన్నత పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు ట్రస్మా జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని సేవలు అందిస్తానని అన్నారు. అనంతరం ఎన్నికైన రమేష్ ను గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్, నాయకులు రాయపల్లి యాకయ్య గౌడ్,దీకొండ శ్రీనివాస్ గౌడ్,జలగం శ్రీనివాస్ గౌడ్,బాలగాని నరసయ్య గౌడ్, కొండం జనార్దన్ గౌడ్, చిరగాని రమేష్ గౌడ్, పులి ముత్తిలింగం గౌడ్,అనేపురం వెంకన్న గౌడ్, పెరుమాళ్ళ వెంకన్న గౌడ్, పెరుమాళ్ళ రమేష్ గౌడ్,వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు దేవేందర్ రెడ్డి,నరేష్ రెడ్డి, రవీంద్రనాథ్ లు అభినందించారు.

## పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం





**తొలి అక్షరం/నరసింహుల పేట అక్టోబర్ 23:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నరసింహుల పేట పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పీ తొర్రూర్ డిఎస్పి ఆదేశాల మేరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై మాలోత్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరును,పోలీస్ స్టేషన్ లో నిర్వహించే విధులు, పౌరులు పొందాల్సిన సేవల గురించి వివరించారు. విద్యార్థులకు డయల్ 100,షీ టీమ్,సైబర్ క్రైమ్,ఆయుధాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే డిపార్ట్మెంట్ అని పాత నేరస్తుల ను గుర్తుపట్టడానికి పింగర్ ప్రింట్ ద్వారా గుర్తించడం లాంటి వివిధ అంశాలపై విద్యార్థిని, పోలీస్ అమరవీరుల గురించి,భరోసా సెంటర్, ఫ్రెండ్లి పోలీసింగ్ విధానం విద్యార్థులకు వీహెచ్ఎఫ్ సెట్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన అంశాల గురించి, చదువు ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ. మమత. ఉష. తోపాటుపోలీస్ విద్యార్థులు తో పాటు తదితరులు పాల్గొన్నారు

## ఎస్సై కరుణాకర్‌ను కలిసిన పద్మశాలి సంఘం

**ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన సంఘ నాయకులు.**

**మండలంలో సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చ.**

**పద్మశాలి సంఘం అధ్యక్షులు దొనిపర్తి వెంకటేశ్వర్లు, సెక్రటరీ సామల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో.**

**జిల్లా, మండల స్థాయి కార్యవర్గ సభ్యులు, కుల బాంధవుల పెద్ద ఎత్తున హాజరు.**



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 23:** ఇనుగుర్తి మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఇనుగుర్తి మండల ఎస్సై కరుణాకర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కరుణాకర్ ని సంఘం నాయకులు కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి మండల పద్మశాలి సంఘ అధ్యక్షులు దొనిపర్తి వెంకటేశ్వర్లు, సెక్రటరీ సామల వెంకటేశ్వర్లు, కోశాధికారి కారంపూడి ఏకాంబరంలు ముఖ్యంగా పాల్గొన్నారు.పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ, స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో శాంతి భద్రతలను పర్యవేక్షించడంలో సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ మర్యాదపూర్వక భేటీలో జిల్లా సెక్రెటరీ సామల నరసయ్య, ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు సామల రమేష్, బొద్దుల సతీష్, గోనె శ్రీనివాస్, గోనె పరమేశ్వర్ పాల్గొన్నారు.అదే విధంగా, దొనిపర్తి ఉప్పలయ్య, సుంకనపల్లి వెంకన్న, కమటం కృష్ణమూర్తి, గణపురం అశోక్, గణపురం రమేష్, చిదురాల శ్రీనివాస్, చిదురాల చంద్రమోహన్ మరియు ఇతర కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరై ఎస్సై కరుణాకర్‌తో మాట్లాడారు. మండలంలో కుల సంఘం చేపడుతున్న వివిధ సామాజిక, సేవా కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా ఎస్సై దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

## దక్షిణ భారత జాతీయస్థాయి సీనియర్ ఖోఖో పోటీలలో రెఫరీగా కోట రాంబాబు

- అభినందించిన నర్సంపేట ఎం.ఈ.ఓ కొర్ర సారయ్య




**తొలి అక్షరం/నర్సంపేట అక్టోబర్ 23:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ హై స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గా విధులు నిర్వహిస్తున్న కోట రాంబాబు 31 వ దక్షిణ భారత జాతీయ స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు న్యాయ నిర్ణేతగాఎంపికైనట్లు బాయ్స్ హై స్కూల్ ఉన్నత పాఠశాల,ప్రధానో పాధ్యాయులు నర్సంపేట మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య తెలిపారు. ఈ పోటీలు ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు కర్ణాటకలోని దవనగిరి లో జరుగుతాయని ఆయన తెలియజేశారు.అదేవిధంగా 31వ దక్షిణ భారత జాతీయస్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు రిఫర్ గా ఎంపిక అయినటువంటి కోట రాంబాబు మాట్లాడుతూ... తెలంగాణ ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు,జంగా రాఘవ రెడ్డి కి ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తికి, ఉమ్మడి వరంగల్ జిల్లాఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట శ్యాం ప్రసాద్ లకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- ప్రజలు ఆందోళన చెందొద్దు
- తొర్రూరు తహశీల్దార్ జి శ్రీనివాస్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),అక్టోబర్23:** కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు,మంజూరు ప్రక్రియపై ప్రజల్లో ఉన్న గందరగోళం నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామని తొర్రూరు తహశీల్దార్ జి శ్రీనివాస్ స్పష్టం చేశారు.కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం ఎటువంటి చివరి తేదీ లేదని ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించిన పూర్తి వివరాలను తొర్రూరు తహశీల్దార్ జి శ్రీనివాస్ వెల్లడించారు.**దరఖాస్తు విధానం:** కొత్త రేషన్ కార్డు కావాలన్నా లేదా కుటుంబ సభ్యుల మార్పులు/చేర్పులు చేయాలన్నా, దరఖాస్తుదారులు తప్పనిసరిగా మీ సేవ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అధికారిక పరిశీలన: మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత, ఆ వివరాలు అధికారుల లాగిన్ లోకి వస్తాయి. సంబంధిత అధికారి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి (ఎంక్వైరీ) జిల్లా సరఫరాల అధికారి (డిఎస్ఓ) కి పంపిస్తారు అని అన్నారు. **మంజూరు :** డీఎస్ఓ ఆమోదం (అప్రూవల్) లభించిన తర్వాత, దరఖాస్తుదారుడికి తరువాత నెల కోటాలో రేషన్ పంపిణీ ప్రారంభమవుతుంది అని తహశీల్దార్ జి శ్రీనివాస్ వెల్లడించారు.**అవసరమైన పత్రాలు:** కొత్త కార్డుకు దరఖాస్తు చేసేవారు ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలి. ఆధార్ కార్డులో చిరునామా మార్పు ఉంటే లేదా ఇతర నివాస రుజువు కావాలంటే, కరెంట్ బిల్లు, ఎలక్షన్ కార్డు, గ్యాస్ బిల్లు, లేదా బ్యాంక్ అకౌంట్ వివరాలు వంటి అనుబంధ పత్రాలను జతచేయాల్సి ఉంటుంది అని అన్నారు.**చివరి గడువు లేదు:** రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి గడువు లేదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ జి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుని సరైన పత్రాలు జతచేస్తే త్వరగా రేషన్ కార్డులు మంజూరవుతాయని తహశీల్దార్ సూచించారు.ఈ విషయంలో ఏమైనా సందేహాలుంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## జంకు తండ గ్రామ పంచాయతీలో ఎస్సీ కులాలకు అన్యాయం

- రెండు వందల ఎస్సీ కుటుంబాలు ఐదు వందల ఓటర్లు ఉన్నా కనీసం ఒక్క వార్డు నెంబర్ స్థానం కూడా కేటాయించలేదు
- అధికారులు వెంటనే స్పందించాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన ఎస్సి నాయకులు




**తొలి అక్షరం/మిర్యాలగూడ/ అక్టోబర్ 23:** మిర్యాలగూడ మండలంలోని జంకు తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రెండు వందల కుటుంబాలు మరియు ఐదు వందలకు పైగా ఓటర్లు ఉండగా కనీసం ఒక్క వార్డ్ మెంబర్ స్థానం కుడా కేటాయించక పోవడం చాలా బాధాకరమని ఎస్సీ ఓటర్లు అధికారులపై మండిపడుతున్నారు గతంలో వెంకటాద్రిపాలెం జంకు తండా కలిసి ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉండేవని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసిన క్రమంలో జంకు తండ ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది కొత్త గ్రామపంచాయగా ఏర్పడిన తర్వాత కూడా పాత ( 2011) జనాభా లెక్కల ప్రకారం జంకు తండా గ్రామంలో ఉన్న ఎస్సీ జనాభాను జీరోగా చూపించి రాజకీయంగా ఎస్సీ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ సామాజిక వర్గ ఓటర్లకు అనుగుణంగా వార్డు మెంబర్లను కేటాయించాలని కోరుతున్నారు అదేవిధంగా ఎస్సీ ప్రజల సమస్యలపై సబ్ కలెక్టర్ ఆఫీసులో వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో కామిశెట్టి శ్రీనివాస్ మైనం భరత్ అన్నపూరి నాగరాజు వేడవేట్ల బన్నీ బుడిగపాక సోమయ్య అంకురి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## స్మశానంలో వెలుగు: చెత్తాచెదారం, పొదలమయమైన స్మశాన వాటికకు కొత్త ప్రాణం.

**సాంకేతిక సహకారం: శ్రమతో పాటు జెసిపి సాయంతో వేగవంతమైన శుభ్రత**

**నిజమైన 'దేవుడి వరం': సేవను దైవకార్యంగా భావిస్తున్న అశోక్ గౌడ్**

**మరెన్నో శిఖరాలు: గ్రామాభివృద్ధికి ఆయన కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తున్న స్థానికులు**



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 23:** గ్రామం అంటే కేవలం నివాసం కాదు, అది మన మూలాలు. ఆ మట్టి రుణం తీర్చుకోవడంలో ఎప్పుడూ ముందుంటానని నిరూపించారు చిన్ననాగారం గ్రామ బైరు అశోక్ గౌడ్. ఎక్కడైతే మన పూర్వీకులు ప్రశాంతంగా నిద్రిస్తున్నారో, ఆ స్మశాన వాటిక మొత్తం భారీ చెట్లు, కంపపొదలతో నిండి, అంధకారంగా మారింది.ఈ దుస్థితిని చూసి చలించిన అశోక్ గౌడ్, ఎలాంటి ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా, తన వ్యక్తిగత ఖర్చుతో ఈ మహత్తర కార్యాన్ని చేపట్టారు. కేవలం మనుషులతోనే కాకుండా, పనులను వేగవంతం చేసేందుకు ఒక (జేసీబీని) కూడా ఏర్పాటు చేసి, దాని సాయంతో భారీ చెట్లను, పొదలను తొలగించారు. కార్మికులు, యంత్రాలతో కలిసి యుద్ధ ప్రాతిపదికన మొత్తం స్మశాన వాటికను శుభ్రం చేయించారు. నిరుపయోగంగా మారిన ఆ ప్రదేశం ఇప్పుడు స్వచ్ఛతతో ఆహ్లాదకరంగా మారింది.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పిన మాటలు అందరి హృదయాలను తాకాయి. "నేను ఈ సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరం అని అనుకుంటాను. నా గ్రామానికి, నా ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం నా అదృష్టం. ఇదొక దైవకార్యంలా భావిస్తున్నా," అని భావోద్వేగంతో పలికారు. సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని, భవిష్యత్తులోనూ గ్రామానికి తన వంతు సహకారం అందిస్తూనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.అశోక్ గౌడ్ నిస్వార్థ సేవ పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. "ఆయన గ్రామ సేవలో అంకితభావం చూపించే దైవసమానుడిగా కనిపిస్తున్నాడు. ఇలానే నువ్వు గ్రామానికి ఎన్నో మంచి పనులు చేయాలని, నీకు దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం," అంటూ హృదయపూర్వకంగా అభినందించారు. కార్మికులతో పాటు జెసిపి ని ఉపయోగించి అతి తక్కువ సమయంలో పూర్తి చేసిన ఆయన కృషి మొత్తం గ్రామానికి ఆదర్శప్రాయం.

## జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రజా వేదిక




**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్ 23:** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సామాజిక తనిఖీలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం పై ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో విజయ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా పిడి మధుసూదన్ రాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా 18 గ్రామాలలో ఈనెల 15 నుంచి 22 వరకు ఇంటింట నిర్వహించిన తనిఖీ వివరాలను ప్రజా వేదికలో వెల్లడించారు పలు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లపై పిడి మధుసూదన్ రాజు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహమ్మద్ అప్సర పాషా ఈసీ ఏపీఓ పాల్గొన్నారు.

## రైతులు యూరియాపై ఆందోళన చెందొద్దు: ఏవో వాహిని

**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్ 23:** మండలంలోని రైతులకు రవి పంటకు సంబంధించిన ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన చెందకూడదని ఏవో వాహిని అన్నారు గురువారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడుతూ రైతులకు యూరియాతోపాటు ప్రభుత్వం సబ్సిడీపై పలు రకాల పనిముట్లను అందించనుంద న్నారు. రైతులకు గ్రామాల వారీగా రైతు వేదికలో క్లస్టర్ యూరియా బత్తాలను అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఏఈఓ లు దీక్షిత్ కుమార్ ఉదయ్ కిరణ్ శిరీష పాల్గొన్నారు.

## బిజెపితోనే సంక్షేమ పథకాలు సాధ్యం : మాజీ ఎంపీ సీతారాం నాయక్



**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్ 23:** బిజెపితోనే దేశంలో సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందుతుందని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని రాష్ట్రాల్లో బిజెపి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో కార్యక ర్తలు తీసుకెళ్లాలని సూచించారు డోర్నకల్ నియోజకవర్గంలో బిజెపి రానున్న రోజుల్లో జండాని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ నాయకులు పూర్ణాచందర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాలు






**తొలి అక్షరం/గణపురం/అక్టోబర్:24**గణపురం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించినట్లు ఎస్ఐ రేఖ అశోక్ తెలిపారు. ఇందులో ప్రధానంగా పిటిషన్ మేనేజ్మెంట్, ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్, డైల్ 100, డ్రగ్స్ నిర్మూలన, సైబర్ క్రైమ్ విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ లో ఉన్న సెట్ ఏ విధంగా పనిచేస్తుందో అనేది వారికి ప్రాక్టికల్ గా చూపించారు.

## వాసాలమర్రి గ్రామంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. ఇందిరమ్మ ఇల్లుల నిర్మాణం పురోగతి,గ్రామంలో పలు సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను సంబంధితాధికారులకు అందచేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పరసన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, అధికారులు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెసు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టుకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా గురువారం రోజున జిల్లా కేంద్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుని అరెస్టు చేసినందుకుగాను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది.అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో గోరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని గోరక్షకులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై చర్య తీసుకోవాలని ఎంఐఎం తొత్తులుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం జరిగింది.

## ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ని కలిసిన గొంగిడి దంపతులు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** ఎర్రవెల్లి నివాసంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని కలిసి తమ రెండవ కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన మాజీ ప్రభుత్వ విప్,ఆలేరు తాజామాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత-డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి దంపతులు.

## పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న దైద రవీందర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి





**తొలి అక్షరం/రామన్నపేట 23:** కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికీ చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గద్దపాటి సతీష్ జన్మదినం సందర్భంగా తన స్వగృహంలో కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

## చట్టాల అమల్లో కఠినంగా వ్యవహరించాలి

- ప్రజలకు సేవ దృక్పథంతో విధులు నిర్వహించాలి: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుధీర్ రాంనాథ్ కేకన్






**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 23:** చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించాలని, ప్రజలతో సేవ దృక్పథంతో విధులు నిర్వహించాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ రాంనాథ్ కేకన్ పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ సుధీర్ ఆర్. కేకన్ ఆధ్వర్యంలో జిల్లా క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నమోదైన క్రిమినల్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, మహిళా భద్రత, సైబర్ నేరాలు, అక్రమ రవాణాలు, గంజాయి నియంత్రణ చర్యలు, మరియు ప్రజా శాంతి భద్రత అంశాలపై సమగ్రంగా చర్చించారు.ప్రతి అధికారి నుండి వారి పరిధిలోని కేసుల వివరాలు తెలుసుకొని, దర్యాప్తు వేగవంతం చేయాలని, న్యాయం జరుగేలా ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, చట్టం అమలు పరంగా కఠినంగా ఉండడమే కాకుండా, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు.ఇటీవల జిల్లాలో రైతుల కోసం నిర్వహించిన యూరియా పంపిణీ కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన పోలీస్ అధికారులకు మెమెంటో, శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందనలు పోలీస్ స్టేషన్ లో ఉన్న ప్రతిఒక్కరికి వర్తిస్తుందని అన్నారు.ఈ సందర్భంలో విధుల్లో క్రమశిక్షణ, సమన్వయం, నిబద్ధతతో పాల్గొన్న అధికారుల పాత్రను ప్రశంసిస్తూ, జిల్లా పోలీస్‌కు రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చినందుకు అభినందించారు.క్రైమ్ మీటింగ్ అనంతరం, కోర్ట్ డ్యూటీ లో అద్భుతంగా పనిచేసిన సీడో సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్పీ స్వయంగా అందజేశారు. విధుల్లో చూపిన నిబద్ధత, సమయపాలన, న్యాయ వ్యవస్థతో సమన్వయం చూపినందుకు అధికారులను ప్రోత్సహిస్తూ, ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నుండి డిఎస్పీలు, ఎస్హెచ్ఓలు, సిఐలు ఎస్సైలు, వివిధ యూనిట్‌ల ఇన్‌చార్జ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం: శివ కేశవుల ఏక రూప దర్శనం! దీపారాధనే మోక్ష ద్వారం

- నిజాంపేట అర్చకుల భక్తి ప్రవచనం
- హరిహర సమ్మేళనం: శివుడు, విష్ణువులకు ప్రీతిపాత్రమైన పవిత్ర మాసం.
- కార్తిక మాసాలలో సాటిలేదు, గంగతో సమానం.
- 365 ఒత్తులతో దీపారాధన - ఏడాది పూజ ఫలం.
- కార్తీక స్నానం, వ్రతాలు, దానాలతో అష్టైశ్వర్య వృద్ధి.



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 23:** హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన, మహిమాన్వితమైన కార్తీక మాస గొప్పదనాన్ని నిజాంపేట ఆంజనేయస్వామి అర్చకులు పవన్ స్వామి భక్తి పారవశ్యంతో వివరించారు. ఈ మాసం హరిహరుల దివ్య శక్తిని ఒకే చోట దర్శించుకునే మహదవకాశమని, మోక్ష సాధనకు ఇది సులభమైన మార్గమని ఆయన భక్తులకు తెలియజేశారు.పవన్ స్వామి మాట్లాడుతూ, "కార్తీక మాసం సాక్షాత్తూ శివ కేశవుల ఏక రూప దర్శనం. ఈ మాసమంతా నదీ స్నానాలు, దీపారాధన, ఉపవాసాలు, దానాలు ఆచరించడం వల్ల ఏడాది పొడవునా చేసిన పుణ్యం లభిస్తుంది. కార్తీక మాసానికి సాటిరాగల మాసం ఈ సృష్టిలో లేదని స్కంద పురాణం ఘోషిస్తోంది" అని పేర్కొన్నారు.**దీపారాధన ప్రాముఖ్యత:** "కార్తీక మాసంలో ప్రతిరోజు తులసి కోట వద్ద, శివాలయంలో దీపం వెలిగించడం దైవానుగ్రహాన్ని పెంచుతుంది. ముఖ్యంగా, కార్తీక పౌర్ణమి (త్రిపుర పౌర్ణమి) నాడు 365 ఒత్తులతో దీపారాధన చేయడం ద్వారా సకల పాపాలు హరించి, అఖండ ధనయోగం, శుభాలు ప్రాప్తిస్తాయి. దీపం కేవలం వెలుగు కాదు, అది జ్ఞానానికి, మోక్షానికి చిహ్నం" అని ఆయన వివరించారు.**వ్రతాలు - ఫలితాలు:** కార్తీక మాస సోమవారాల ఉపవాసాలు, క్షీరాబ్ది ద్వాదశి నాడు ఉసిరి-తులసిని పూజించి వనభోజనం చేయడం వల్ల సకల శుభాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని స్వామి తెలిపారు. ఈ నెలలో భక్తితో ఆచరించే నియమ నిష్ఠలు, కార్తీక మాస పురాణం పారాయణం ఆరోగ్యంతో పాటు మోక్షాన్ని ప్రసాదిస్తాయని అన్నారు.

## బి.సి ల్లారా ఇకనైనా మేల్కోండి

**తెలంగాణ ఉద్యమ పోరాటం స్ఫూర్తితో ముందుకు సాగాలి.**

**సకలజనుల తరహాలో ఉద్యమం తరహ సకల బీ.సీ ల ఉద్యమం మొదలవ్వాలి**

**బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు, బి.సి జెఏసి చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**

**తొలి అక్షరం/నర్సంపేట అక్టోబర్ 23:** నర్సంపేట పట్టణంలోని బి.సి సంక్షేమ సంఘం పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్, డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరై బిసి రిజర్వేషన్ల పోరాటం రాష్ట్రంలో రోజు రోజుకు ఉధృతం అవుతున్న సందర్భంగా.. బి.సిలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ...




తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు బిసి రిజర్వేషన్ల పోరాటం ఉగ్రరూపం దాలుస్తుందని ఈ అవకాశాన్ని ఒడిసి పట్టుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వనుకు పుట్టే విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సకలజనుల సమ్మె తరహాలో బి.సి జెఏసి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల జెండాలు పక్కన పెట్టి బి.సి జెఏసి ఆధ్వర్యంలో బిసి జెండాలు పట్టుకుని రిజర్వేషన్లు సాధించుకునే వరకు ఉద్యమం చేసే సమయం ఆసన్నమైనదని అన్నారు. అదేవిధంగా వరంగల్ గడ్డ అంటేనే పోరాటాల పురిటిగడ్డ అని అందులో నర్సంపేటకు ప్రత్యేక స్థానం ఉంటుందని గుర్తుచేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా బి.సి లు 42 శాతం రిజర్వేషన్ల పోరాటంలో రాజకీయ పార్టీలకు అతీతంగా జెండాలు పక్కన పెట్టి కులాలకు అతీతంగా అందరూ ఏకమై బి.సి జెండాలు పట్టుకుని ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్,జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్,బీసీ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు,నర్సంపేట పట్టణ బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి గుడిలో కార్తీక భక్తి జ్యోతి

**కార్తీకమాసం రెండో రోజు సందర్భంగా భక్తుల సందోహంతో కళకళలాడిన ఆలయం**

**మహిళలు శివలింగాభిషేకం, దీపారాధన, భజనలతో గుడి ప్రాంగణాన్ని భక్తిరసమయం చేశారు**

**సాయంకాలం ఆకాశ దీప మహోత్సవం: దీపాల కాంతులతో మెరిసిన నిజాంపేట్ ఆకాశం**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 22:** నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో కార్తీకమాసం రెండో రోజు భక్తి జ్వాలలు వెలుగొందాయి. తెల్లవారుజామున నుంచే మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శివలింగాభిషేకం, దీపారాధన, భజనలతో గుడి ప్రాంగణాన్ని ఆధ్యాత్మికతతో నింపారు. "ఓం నమః శివాయ" మంత్రోచ్చారణలతో గాలి మార్మోగగా, భక్తుల ముఖాల్లో ఆత్మశాంతి పరచుకుంది.సాయంకాలం నిర్వహించిన ఆకాశ దీప మహోత్సవం భక్తుల హృదయాలను కదిలించింది. వందలాది దీపాలు ఆకాశంలో మెరిసిపోగా, ఆ కాంతి వెలుగుల్లో ఆలయ ప్రాంగణం దేవాలయ సౌందర్యాన్ని మరింత ప్రతిబింబించింది. కార్తీకమాసం మొత్తం ఈ భక్తి కార్యక్రమాలు భక్తుల సమక్షంలో నిరంతరంగా కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా అర్చకులు అనిల్ స్వామి మాట్లాడుతూ, "కార్తీకమాసం ప్రతి క్షణం పవిత్రతతో నిండినది. శివార్చన, దీపదానం, ఆకాశ దీపారాధన మన జీవితంలో ఆత్మజ్యోతి వెలిగించే క్షణాలు. ఈ మాసం పుణ్యఫలం అమోఘం ఒ ఒక దీపం వెలిగిస్తే అది మన పాపాలను దహనం చేస్తుంది, మనసుకు శాంతి ప్రసాదిస్తుంది. భక్తుల భక్తి, విశ్వాసం, అంకితభావం ఈ ఆలయ మహిమను మరింత వెలిగిస్తున్నాయి" అని అన్నారు.

## నవంబర్ 9న జి.ఎం.పి.ఎస్. 3వ జిల్లా మహాసభ జయప్రదం చేయండి

- జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్




**తొలి అక్షరం/నర్సంపేట అక్టోబర్ 23:** పట్టణంలోనీ పద్మశాలి ఫంక్షన్ హాల్లో నవంబర్ 9 వ తారీఖున జరగబోవు గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం వరంగల్ జిల్లా మూడో మహాసభ జయప్రదం చేయండి అని తెలంగాణ గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘంట జి.ఎం.పి.ఎస్ఊ వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ గొల్లకురుమలకు పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణంలో నీ గెస్ట్ హౌస్ నందు జిఎంపిఎస్ వరంగల్ జిల్లా మూడవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించా రు,అనంతరం జిఎంపిఎస్ మండల అధ్యక్షులు రాజులపాటి సూరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ... గొల్లకురుమల సమస్యల పరిష్కరణకై ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన అన్నారు,ఎన్నికల్లో గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,వృత్తి రీత్యా గొల్లకురుమలు మూగజీవాల మేపుటకు వెళ్ళినప్పుడు విష పురుగుల వల్ల, వివిధ రూపాల్లో చనిపోతున్నారని, చనిపోయిన గొర్రెల కాపరుల కుటుంబానికి పదిలక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు, ఖాళీగా ఉన్న వెటర్నరీ పోస్టులను భర్తీ చేసి, మూగజీవాలకు ఎల్లవేళలా వైద్యం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు, గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు,తదితర సమస్యల పరిష్కారానికి వరంగల్ జిల్లా మూడవ మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని వారు వివరించారు, ఈ మహాసభ జయప్రదంకై గొల్లకురుమలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి కుండే లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మల్లేష్, జక్క రవి,మండల కార్యదర్శి దాడి రాజు మండల ఉపాధ్యక్షులు పైడిపల్లి కొమురయ్య, గజ్జి కుమారి, సహాయ కార్యదర్శి తోటకూరి ఐలయ్య, కర్జన శ్రీను, గంద్రకోట అనిల్,స్వామి, పాల్గొన్నారు.

## ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు బిజెపి ధర్నా

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ధాన్యానికి 500 రూపాయలు బోనస్ 2,00,000 రుణమాఫీ కూలి రైతుల 12,000 రైతుబంధు 6000 రూపాయలు అన్ని అమలు చేస్తానని గద్దనెక్కి నేడు ఏది నెరవేర్చకుండా ప్రభుత్వం ముఖం చాటేస్తుంది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ డిమాండ్ చేస్తుంది. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను గ్రామాలలో తిరుగనీయం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రేగటి మచ్చగిరి,జిల్లా కార్యవర్గ సభ్యుడు బొబ్బల ఇంద్రారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బందారు సత్యనారాయణ,బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి,బీజేవైఎం మండల పార్టీ అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్,ఓబిసి మోర్చా మండల పార్టీ అధ్యక్షులు సూదగాని శ్రీహరి గౌడ్,మండల కోశాధికారి బూడిది నరసింహ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి మధు,భూత అధ్యక్షులు లోడి వెంకటయ్య లోడ్,బద్రి భాస్కర్ రెడ్డి,బిజెపి నాయకులు నాగం సత్తిరెడ్డి, పరకాల రాంబాబు,మజ్జిగ రమేష్, ఎండి ఆ బాస్,బి జె వై ఎమ్ నాయకులు మజ్జిగ నరేష్,లోడి మహేష్,బండారు సాయి,సూర్య, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెసు కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

**● బిజెపి మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షుడు గుదే మధుసూధన్ యాదవ్**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అదనపు నిధులు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన మరియు ఉపాధి హామీ స్వచ్ఛ భారత్ మిషన్ అనుసంధానం.ఇందిరమ్మ ఇండ్ల కమిటీలలో ఏ పార్టీ కార్యకర్తలనూ చేర్చకుండా కాంగ్రెస్ కార్యకర్తకు మాత్రమే ఇల్లు మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా కేంద్ర సంక్షేమ పథకాలు అందిస్తుందని ఇది నిదర్శనం.(పీఎంఏవై) అనేది కేంద్ర ప్రభుత్వ పథకం.తెలంగాణలో గృహనిర్మాణ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి పీఎంఏవైతో అనుసంధానం చేసి లబ్ధిదారులకు అదనపు నిధులను అందిస్తున్నారు.కేంద్రం నుంచి అదనపు నిధులు లభించడంతో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం మరింత పెరగనుంది.ఇప్పటివరకు ఒక్కో ఇంటికి పీఎం ఆవాస్ యోజన కింద రూ.72 వేల ఇస్తుండగా ఇప్పుడు కొత్త మార్పులతో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.27 వేలు,స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.12 వేలు కూడా ఇవ్వనున్నారు.అంటే అదనంగా రూ.39 వేలు రానున్నాయి.ఒక పేద కుటుంబం ఇంటి నిర్మాణం చేస్తుంటే ఇంటి పనులు 90 రోజుల పాటు ఉపాధి హామీ జాబ్ కార్డు ద్వారా చేసుకోవచ్చు.రోజుకు రూ.300 కూలీగా వస్తుంది.దీంతో ఒకేసారి ఇల్లు కూడా నిర్మాణమవుతుంది. కుటుంబానికి ఉపాధి కూడా లభిస్తుంది. ఇలా రూ.27 వేలు అందుతాయి.ఇక మిగిలిన రూ.12 వేలు ఎస్బీఎంలో టయిలెట్స్ నిర్మాణంతో పాటు పారిశుధ్యపనులకు కేంద్రం ఇస్తుంది.ఇలా మొత్తం రూరల్‌లో ఒక్కో ఇంటికి అదనంగా రూ.39 వేలు కేంద్రం నుంచి అందుతాయి. ఒక్కో లబ్ధిదారుడికి ఇప్పుడు మొత్తం 1.11 లక్షలు కేంద్రం నుంచి అందుతాయి. మోత్కూర్ మండలంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులందరూ ఈ పథకాలని వినియోగించుకోవాలని మోత్కూర్ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ మోర్చా కొంపెల్లి గణేష్ ఉపాధ్యక్షులు నార్సింగ్ మహేష్, ముక్కాముల గణేష్ వెండి రజనీకాంత్,కందికట్ల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# మునిపంపుల గ్రామంలో స్వర్గీయ దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత కంటివైద్య శిబిరం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, మునిపంపుల గ్రామంలో స్వర్గీయ దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత కంటివైద్య శిబిరం 2వ రోజున మొత్తం 350 మందికి పరీక్షలు నిర్వహించగా, 80 మందికి శస్త్ర చికిత్స కోసం సిఫార్సు చేయడం జరిగింది. 245 మందికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగింది. గురువారం రోజు మునిపంపుల, పల్లివాడ గ్రామాల ప్రజలు రావడం జరిగింది. శుక్రవారం రోజున దుబ్బాక, లక్ష్మాపురం గ్రామ ప్రజలకు చూడడం జరుగుతుంది. వారికి ఇచ్చిన తేదీలలో ఆయా గ్రామ ప్రజలు రాగలరని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం నిర్వాహకులు దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు సందర్శించడం జరిగింది. వారితోపాటు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తోలుపునూరు చంద్రశేఖర్,వాలంటీర్లు కంటి పరీక్షలకు వచ్చిన ప్రజలకు కావలసిన పరీక్షలు చేయించడం జరిగింది.

# 42% బీసీల స్వాతంత్ర ఉద్యమానికి కదలి రండి

**ఇందిరా పార్క్ దగ్గర జరిగే ధర్మ యుద్ధ ధర్నాకి బీసీ ఎస్సి, ఎస్టీ యువత కదలండి.**

**ధర్మసమాజ్ పార్టీ రామన్నపేట మండల అధ్యక్షులు:బందెల అశోక్**




**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 23:** తెలంగాణ రాష్ట్రంలో బీసీ 42% రిజర్వేషన్ల కొరకై ఈ రోజు 24-10-2025న ఇందిరా పార్క్ వద్ద జరుగుతున్నటువంటి ధర్నాకి రామన్నపేట మండలంలోని మరియు రాష్ట్ర బీసీ ప్రజలందరూ ఎస్సీ ఎస్టీ ప్రజలందరూ ముఖ్యంగా యువత ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలాని బందెల అశోక్ తెలియజేశారు. ఈ మహా ధర్నా ఇందిరా పార్కు దగ్గర బీసీ రిజర్వేషన్ సాధాన సమితి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏస్ చిరంజీవులు బీసీ ఎస్సిఎస్టీ-జెఏసి కన్వీనర్ డా.విశారాదన్ మహారాజ్ గారి ఆధ్వర్యంలో జరుగుతున్న బారి ధర్నా కి తెలంగాణ సమాజమంతా హాజరై విజవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42% రిజర్వేషన్స్ విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికల్లో అదేవిధంగా సెంట్రల్ సివిల్ పరీక్షల్లో మరియు చట్ట సభల్లో అవకాశం కల్పించకుండా 70 సంవత్సరాల నుండి మోసం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయినటువంటి కాంగ్రెస్ పార్టీ, 42% బీసీ లకు రిజర్వేషన్ల కొరకు వారి చిత్తశుద్ధితో కేంద్రం లో ఉన్న బిజెపి పార్టీతో కొట్లాడి పార్లమెంట్ లో చట్టం చేసేంత వరకు కొట్లాడాలని తెలియజేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేసి 9th షెడ్యూల్లో పెట్టి 42% రిజర్వేషన్ కు రక్షణ కల్పించాలని తెలియజేశారు, భారతదేశవ్యాప్తంగా అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో దాదాపు జనాభాలో సగ భాగంగా ఉన్నటువంటి బీసీలకు వారి జనాభా తగ్గట్టుగా రిజర్వేషన్లు మరియు రాజకీయ అధికారాలు రాజ్యాంగబద్ధంగా జరగాలని వారి హక్కులను వారికి కల్పించాలని కోరారు. కాబట్టి రేపు జరగబోయేటువంటి మహా ధర్నాకు రాష్ట్రంలో ఉన్న ప్రతి యువకుడు పాల్గొనాలని భారతదేశంలో కనివిని ఎరిగినటువంటి తెలంగాణ ఉద్యమం కంటే పది రెట్ల పోరాట ఉద్యమం జరగాలని దాని ద్వారా మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తలొగ్గి బీసీలకు న్యాయం చేస్తారని తెలియజేశారు.

# విద్యార్థులకు సరైన భోజనం అందించండి: బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** భారతీయ జనతా యువ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ ఆధ్వర్యంలో మోటకొండూర్ మండలం జ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాలలో గత కొంతకాలంగా విద్యార్థినిలు చాలా ఇబ్బందులు పడుతున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు గురుకుల కళాశాలలో చదువుకున్న విద్యార్థులు మా దృష్టికి తీసుకువచ్చిన విషయం మీకు తెలియజేస్తున్నాం.గత 17 రోజులుగా వంట మాస్టర్ లేకుండా వారి కింద పని చేసే మహిళలతో వడ్డించడం జరుగుతుంది.వారికి వంట చేసి చేయరాక నానా అవస్థలు పడుతూ పిల్లలకు ఏదో రకంగా వండి ఇవ్వడం జరుగుతుంది.దానివల్ల పిల్లలు తినలేక పస్తులు ఉండలేక పోతున్నారు.ఆ అన్నం తిని అనారోగ్యానికి గురై చాలామంది విద్యార్థులు ఇంటి బాట పట్టారని అన్నారు.అయ్యా ముఖ్యమంత్రి విద్యా శాఖను మీ దగ్గర ఉంచుకొని ఎన్నో అద్భుతాలు సృష్టిస్తానని చెప్పి కనీసం విద్యార్థులకు కడుపునిండా భోజనం లేని దుస్థితిలో ఉన్నాము. దయచేసి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని అంటున్నాము.స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెంటనే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలి. లేనియెడల బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, యువ మోర్చా నాయకులు కొలిచిలిమా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలుగల రాజయ్యను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా రేషన్ డీలర్స్ సంఘం అధ్యక్షులు ఎలుగల రాజయ్య మోకాలు నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భువనగిరి పట్టణంలోని స్థానిక సిగ్ధాకాలనీలోని వారి ఇంటికి వెళ్లి మోకాలు బాధతో ఇబ్బంది పడుతున్న రాజయ్యను పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని అన్నారు. వీరి వెంట ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పరసన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి పలుగుల శ్రీనివాస్,డిసిసి ఉపాధ్యక్షులు భాస్కర్ నాయక్, తుర్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, ఐషర్ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి,సంతోష్ రెడ్డి, యాదగిరి,దామోదర్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# ప్రభుత్వ తీరుపై..! టీయూడబ్ల్యూజే నేత.. గుట్టయ్య తీవ్ర ఆగ్రహం



**తొలి అక్షరం/మహబూబాబాద్ అక్టోబర్ 23:** జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, TUWJ H143 జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, ఈ దాడిని ప్రోత్సహించారంటూ ఆరోపించబడిన వర్ధన్నపేట ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం.., అధికారంలో ఉన్నప్పుడుఒకలాప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా.ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని, అధికారం మా చేతిలో ఉంది, ఏమైనా చేస్తాం" అనే ధోరణి ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అని గుట్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాల్సిన వారే దానిని కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు.రాజ్యాంగం, చట్టం ఉండగా ఇలా దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని ఆయన నొక్కి చెప్పారు. ఇదే వైఖరి కొనసాగిస్తే రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ ఏకమై ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వస్తుందని గుట్టయ్య హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మాల జర్నలిస్టు అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చంద శ్రీనివాస్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూగులోత్ భీమానాయక్, ఇతర పాత్రికేయులు మరియ రాజకీయ నాయకులు.

# రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ఆలేరు బిజెపి నాయకులు




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో రైతు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేయడం జరిగింది.ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా పాల్గొని సమస్యల మీద డిమాండ్ చేస్తూ మాట్లాడడం జరిగింది.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ మరియు మండల అధ్యక్షుడు, నందగంగేష్,పూజారి కుమారస్వామి,జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డేమాన్ నరేందర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి , జిల్లా ఉపాధ్యక్షురాలు కుమ్మరిండ్ల లక్ష్మి,మండల పట్టణ ప్రధాన కార్యదర్శిలు,ఏలగల వెంకటేష్, అంకం శీను,శశత్వం అమరేందర్, నాయకులు తోట మల్లయ్య , ఎలగందుల సురేష్ ,పత్తి రాములు,బందల సుభాష్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కేశత్వం అర్చన,ఐ లీ సందీప్,ఎగిరి సంపత్, కంతుల శంకర్,గుర్రం నరసింహులు, తీరాల శంకర్,గాజుల సారయ్య, కంటి రవి, శ్రీను,సుధా రాజు, కట్ట అమరేందర్ రెడ్డి,కొండరాజు శీను, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు లక్ష్యంగా పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట శ్రీలక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టులోనీ అవినీతినీ బయటపేడుతా ఎమ్మెల్సీ కవీత.అక్టోబరు 25 నుండి 'తెలంగాణ జాగృతి జనం బాట యాత్ర' చేపట్టనున్న నేపథ్యంలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్సీ కవిత. భువనగిరిలో ఓ ప్రైవేటు ఆయుర్వేదిక్ క్లినిక్ ప్రారంభోత్సవానికి హాజరై క్లినిక్ ను ప్రారంభించి బయలుదేరిన ఎమ్మెల్సీ కవిత.



# రైతుల పట్ల అరసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

**- అర్హులైన రైతులకు త్వరలోనే పట్టాల పంపిణీ**



**తొలి అక్షరం/మహబూబాబాద్ అక్టోబర్ 23:** రైతుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ పార్లమెంట్ పరిధిలోని కేసముద్రం మండలం నారాయణపురం రైతులను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి దగ్గరకు తీసుకువెళ్లగా వారి విషయంపై స్పందించిన ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి నారాయణపురం రైతులకి ఎంజాయ్మెంట్ సర్వే ప్రకారం పట్టాలు ఇవ్వాలి, పట్టభూములకి పట్టాలు ఇవ్వాలి నిర్లక్ష్యం చేయవద్దు ఎట్టి పరిసితిలో ఆలస్యం చేయవద్దు... వారం లో రెవిన్యూ మంత్రి పోగ్రామ్ ఉంటది వచ్చి పట్టాలు పంచుతము ఎట్టి పరిసితిలో రైతుల విషయంలో ఆలస్యం చేయవుద్దు అని రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేస్తారని దానిపై రైతులు ఆనందాన్ని సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు.

# నిదానపల్లిలో గ్రామసభ



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 23:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో భాగంగా మండలంలోని నిదాన పల్లి గ్రామపంచాయతీలో 2025-2026 సంవత్సరము లోని పనులను గుర్తించుటకు గాను గ్రామసభ గురువారం ఏర్పాటు చేశారు. గ్రామసభలో టెక్నికల్ అసిస్టెంట్ మధు మాట్లాడుతూ రైతులు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏ ఏ పనులు చేసుకోవాలో వారికి వివరంగా తెలిపారు. ఇ కేవైసీ చేసుకొని వారు ఉంటే చేసుకోగలరని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమన్, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఫీల్డ్ అసిస్టెంట్ భాగ్యమ, గ్రామ ప్రజలు కొండ మల్లేశం, దయ్యాల బీరప్ప, కొండపార్వతమ్మ,కొండ నరసమ్మ, వర్క్ ల చంద్రయ్య, చల్ల యాదమ్మ, ఆగు యాదమ్మ, కడారి మల్లయ్య, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, విజయ, బేబీషాలని తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీలో హెచ్చైసీ వ్యవస్థాపక అధ్యక్షులు సల్మాన్ ఖాన్ చేరడం శుభ పరిణామం

**- ఎండి. అంజద్ టిఆర్ఎస్ నాయకులు రామన్నపేట**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 23:** బి ఆర్ ఎస్ పార్టీ లో హెచ్చైసీ వ్యవస్థాపకుడు, మైనారిటీ నాయకులు సల్మాన్ ఖాన్ బుధవారం బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షములో పార్టీలోకి చేరడం జరిగింది. ఆయన హెచ్చైసీ లో ఉండి ఎందరో పేదవారికి ఆదుకున్నారు అలాగే సల్మాన్ ఖాన్ బి ఆర్ యస్ పార్టీలో చెరినందుకు జూబ్లీహిల్స్ బై ఎలెక్షన్ లో బి ఆర్ యస్ పార్టీలో ఒక కొత్త జోష్ వచ్చిందనిజూబ్లీహిల్స్ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ఘన విజయం సాధిస్తారని రామన్నపేట టిఆర్ఎస్ నాయకులు యం డి అంజద్ పత్రికా సమావేశంలో తెలిపినారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పటిష్టతపై ప్రత్యేక దృష్టి

- రైతులకు సౌకర్యాల కల్పన, కొనుగోలు ప్రక్రియ
- వేగవంతంపై అధికారులకు కీలక ఆదేశాలు
- పిపిసి కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు తప్పనిసరి
- తొర్రూరు తహశీల్దార్ గడిల శ్రీనివాస్





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం), అక్టోబర్23:** తొర్రూరు మండల కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ప్రాథమిక కొనుగోలు కేంద్రాలలో (పిపిసి) రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని తహశీల్దార్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం తొర్రూరు మండల కేంద్రంలోనీ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పిపిసి కేంద్రాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.... కీలక ఆదేశాలు, ఏర్పాట్ల వివరాలు తెలియజేశారు. **పారదర్శకత,నమోదు:** ప్రతి రైతు వారి వరి ధాన్యం వచ్చిన తేదీని తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.కొనుగోళ్లలో జాప్యం లేకుండా రైతుల జాబితా ప్రకారం ధాన్యం తీసుకోవాలని సూచించారు. వరి ధాన్యానికి మద్దతు ధర గురించి రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.పెద్ద మరియు చిన్న వరి ధాన్యాన్ని వేర్వేరు కేంద్రాలలో/ప్రదేశాలలో నిల్వ ఉంచేలా చూడాలని అధికారులను ఆదేశించారు. **కేంద్రాలలో వసతులు:** తగినంత గన్నీ సంచులు (గోనె సంచులు) అందుబాటులో ఉన్నాయని నిర్ధారించుకోవాలి అని అన్నారు. వరి శుభ్రపరిచే యంత్రాన్ని (ప్యాడీ క్లీనర్) ఏర్పాటు చేయాలి అని అన్నారు.ధాన్యం తడవకుండా, నిల్వ ఉంచడానికి టార్పాలిన్లు (పరదాలు) అందించాలి అని కోరారు.తూకం వేసేందుకు,ధాన్యాన్ని ఎత్తేందుకు వీలుగా చెక్క ప్లాట్‌ఫారాలు (పొదలు) అందించాలన్నారు.తాగునీటి ఏర్పాట్లు,టాయిలెట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి అని అన్నారు.రాత్రి సమయాల్లో వెలుతురు కోసం విద్యుత్ సౌకర్యం కల్పించి రైతులు,కార్మికుల కోసం టెంట్లు ఏర్పాటు చేయాలి అని అన్నారు. **సిబ్బంది, రవాణా:** ప్రతి పిపిసి కేంద్రంలో తగినంత మంది కార్మికులు ఉండేలా చూడాలి. పిపిసి సెంటర్ ఇన్‌ఛార్జిలు తమ కేంద్రాన్ని వదిలి వెళ్లకూడదు అని స్పష్టం చేశారు.కేంద్రంలో ఉండి కొనుగోలు పర్యవేక్షిస్తూ వరి సంచుల రవాణాకు సంబంధించి వాహన కాంట్రాక్టర్ సేవలను ఉపయోగించుకోవాలి అని కోరారు.రవాణా కోసం 589 వాహనాలు సిద్ధం చేయాలనీ పేర్కొన్నారు. **పర్యవేక్షణ:** పిపిసి కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాల తక్కువ స్థాయి (ప్రాథమిక) ఏర్పాట్లను పటిష్టం చేయాలి. పిపిసి అధికారులు కేంద్రాల ఏర్పాట్లను తరచుగా తనిఖీ చేయాలి. ఎఈఓ (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) పిపిసి ని సందర్శించి, రైతులకు తరచుగా వచ్చే ప్రశ్నలకు సమాధానాలు, సలహాలు అందించాలి అని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను కోరారు.ఈ కీలక సమీక్షా కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు,ఏవో రామ నర్సయ్య,ఎస్సై ఉపేందర్, సీఈఓ మురళి,డిటీ,ఆర్ఐ,వీఆర్ఏ లు పాల్గొన్నారు.

# గోరక్షకులపై కాల్పులు జరిపిన దుండగున్నీ కఠినంగా శిక్షించాలి

- షాద్ నగర్ హిందూ సంఘాల డిమాండ్




**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** నిన్న ఘట్కేసర్ లో గోరక్షకుడు ప్రశాంత్ కుమార్ సింగ్ పైన ఎంఐఎం దుండగులు జరిపిన తుపాకుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ గోరక్షకుడికి మద్దతుగా ఈరోజు షాద్ నగర్ హిందూ సంఘాల ఆధ్వర్యంలో చౌరస్తాలో నిరసన మరియు దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా హిందూ వాహిని భజరంగ్ దళ్ సభ్యులందరినీ అరెస్టు చేసి షాద్ నగర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. సమాజంలో అశాంతి నెలకొల్పాలని అలజడులని సృష్టించాలని చూస్తున్న ఎంఐఎం గూండాల్లా ఖబర్దార్,తెలంగాణలో ఈ మధ్యకాలంలో తుపాకుల కాల్పుల సంఘటనలు వరుసగా జరుగుతున్నాయి ఇవి ఎంత మాత్రం మన తెలంగాణ సమాజానికి సంస్కృతికి మంచివి కావని దుండగుడు ఇబ్రహీం ని వెంటనే వెతికి పట్టుకొని ఎన్కౌంటర్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,గో మాతను పవిత్రంగా పూజించే హిందువులారా గో హంతకుడిని కఠినంగా శిక్షించే వరకు ఈ ప్రభుత్వాన్ని క్షమించవద్దు అని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమం లో చెట్ల వెంకటేశ్,గూడెం రమేష్, ప్యాట వంశీ, శ్రీనివాస్ చారి,పసులోటి శ్రవణ్, సళ్ళ మహేష్, కుడుముల బాలరాజు,అశోక్ శ్రీనాథ్, సందీప్,రామకృష్ణ,మనోహర్ వరప్రసాద్, రాజు చారి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 26న జరిగే ఏఐటీయూసీ మహాసభను జయప్రదం చేయండి



**తొలి అక్షరం/ములుగు అక్టోబర్ 23:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోగురువారం జరిగిన ఏఐటీయూసీ మఖ్యనాయకుల సమావేశం లో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బండి నర్సయ్య మాట్లాడుతూ కార్మికులు ఎధుర్కొంటున్న అనేక సమస్యలు, ప్రభుత్వాల కార్మిక వ్యతిరేఖ విధానాలపై పోరాట రూప కల్పన చేయడానికి గాను ఈ నెల 26 వ, తేదీన ములుగు జిల్లా లోవెంకటాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవణలో జరిగే ఏఐటీయూసీ మండల మహాసభను, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కావెంజర్లు, హమాలీ కార్మికులు, భవణ నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్స్, నీరడీలు, ఆశ, అంగన్వాడీ, రెండవ ఏ,యన్, యం, లు తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో హజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు,, ఈ సమావేశంలో పాల్గొన్న వారు కొక్కుల రాజేందర్, గాలి సమ్మయ్య, జనగాం శోభ, తోట సంపత్,సంగు పోషమ్మ, నార్లగిరి సరిత, జనగాం లావణ్య,

# ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ని కలిసిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 23:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని (కేసీఆర్) మర్యాదపూర్వకంగా ఎర్రవల్లి నివాసంలో గురువారం రోజున కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి.ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార కార్యకలాపాలపై చర్చ జరిగింది. రాంచంద్రా రెడ్డి బీఆర్ఎస్ పార్టీ బలోపేతం దిశగా తాము చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.కేసీఆర్ పార్టీ శ్రేణులు ప్రజలతో మరింతగా మమేకమై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికి వివరించాలని సూచించారు.

# రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం...

**- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి.**






**తొలి అక్షరం:వలిగొండ, అక్టోబర్, 23:** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో వలిగొండ మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతు సమస్యల పైన బిజెపి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి హాజరైనారు. వారు మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాల కాలంలో రైతులకు ఇచ్చినటువంటి ఎలాంటి హామీలను నెరవేర్చలేదని , రైతు కల్లాలలో, ఐకెపి సెంటర్లో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యం . అయినా పేరుకు ఐకెపి సెంటర్ల వద్ద రిబ్బన్ కటింగ్లు చేయడం జరిగిందని, ఇంతవరకు కాంటలు ప్రారంభించలేదని వారు ఎద్దేవ చేశారు. అలాగే ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి ఆరుగ్యారంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని. స్థానిక ఎమ్మెల్యే కనీసం ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలోని అన్ని ఐకెపి సెంటర్లను వెంటనే ప్రారంభించేటట్టు, కలెక్టర్ గారు సంబంధిత అధికారులు చొరవ చూపి రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. అదేవిధంగా పత్తి రైతులను కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లేని యెడల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఆరై గారికి మెమోరండం అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎం రెడ్డి గారు, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి గారు, రాచకొండ కృష్ణ గారు, కనతాల అశోక్ రెడ్డి గారు, బందార పూ రాములు గారు, కందుల తానేష్ గౌడ్, బోడిగే ఆనంద్, పో ల్ నాగయ్య, మైసొల్ల రామ నర్సు, బిజెపి మండల పదాధికారులు లోడే లింగస్వామి గౌడ్, మండల ఉపాధ్యక్షులు గంగాధరి దయాకర్, మందుల నాగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్త రామచంద్రం, యువ మోర్చా మండల అధ్యక్షులు మందడి రంజిత్ రెడ్డి, పిన్నింటి నరేందర్ రెడ్డి, పార్టీ మండల నాయకులు అంబరీష, బుంగమట్ల మహేష్, సందీప్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శశికాంత్, కీర్తి వెంకటేశం ,శివరంజన్ రెడ్డి, గోవర్ధన్ చారి, సురేష్, సందీప్ గౌడ్, బుంగమట్ల పెద్ద మహేష్, సోమ శ్రవణ్, నారి లింగస్వామి,వివిధ గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు , కార్యకర్తలు పాల్గొన్నారు..

# ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వివిపి పబ్లిక్ స్కూల్ విద్యార్థి

**14 సం, విభాగంలో లాంగ్ జంప్ పోటీలకు ఎంపికైన సాయి వర్షిత్**

**అభినందించిన బాబు నాయక్ మరియు స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ**

**జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడమే లక్ష్యం: సాయి వర్షిత్**

**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామం లోని వివిపి పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న సాయి వర్షిత్ ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ అండర్ 14 సం, ల పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్లోని సరూర్నగర్ స్టేడియంలో జరిగిన ఎస్ జి ఎఫ్ డిస్టిక్ స్థాయి పోటీలో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచడంతో తదుపరి పోటీలకు అర్హత సాధించినట్లు వీఐపీ స్కూల్ పిఈటి బాబు నాయక్ మీడియాకు తెలిపారు. త్వరలో జరిగి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా గెలుపొంది జాతీయస్థాయి పోటీలో రాణించడమే లక్ష్యమని ఎంపికైన క్రీడాకారుడు సాయి వర్షిత్ అన్నారు. విద్యార్థి సెలెక్ట్ కావడంతో స్కూల్ ప్రిన్సిపల్ వెంకటకృష్ణ మరియు పీఈటి రాజన్ నాయక్ మరియు ఉపాధ్యాయుల బృందం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

# త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలి: సిపిఎం పార్టీ డిమాండ్

**• భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం • సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్ రాజు**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ భూ నిర్వాసితుల ఆధ్వర్యంలో ఈరోజు కేశంపేట్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భూ నిర్వాసితులు ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి జగన్ డివిజన్ కార్యదర్శి ఎన్ రాజు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో మొత్తం 26 గ్రామాల గుండా ఆరు మండలాల్లో త్రిబుల్ ఆర్ రోడ్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు షాద్ నగర్ నియోజకవర్గం లోని కేశంపేట్ మండలంలోని 9 రేకుల నిడద వెల్లి గ్రామ త్రిబుల్ ఆర్ రోడ్డు అలాన్మెంట్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలైన్మెంట్ను ప్రకటిస్తూ అట్లాగే రూట్ మ్యాప్ ఇస్తూ సర్వే నెంబర్లతో సహా ఇవ్వటం వలన ఆ సర్వే నెంబర్ లో ఉన్నటువంటి రైతులు అనేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతూ అనేక రూపాలలో నిరసన వ్యక్తం చేయాలని ముఖ్యంగా ఈ త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మ్యాపు లో ఉన్నటువంటి భూముల పట్టాదారులు మొత్తం పేద రైతాంగం ఒక్కొక్కరికి రెండు ఎకరాలు మూడు ఎకరాలు ఉన్నటువంటి పేదలు మాత్రమే ఉన్నారు ఇట్టి పేద రైతులు అట్టి భూములపై వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నటువంటి పరిస్థితి ఉన్నది. ఇట్టే త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఒకచోట ఒకరకంగా ఇంకోచోట ఇంకోరకంగా ప్రకటిస్తూ ఇది కేవలం ఎక్కడ ప్రకటించిన అట్టి భూముల రైతులు పేద రైతులు ఉన్నారు ఇది కేవలం పెట్టుబడుదారుల ప్రయోజనం కోసమే ఈ త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ను చేస్తున్నారని ఇది పేద రైతుల కోసం కాదని ఇది పేదరిక రైతుల కోసం కాదని అందుకనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిత్యం వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నటువంటి మా పేద రైతుల పొట్ట కొట్టొద్దని రైతులు తీవ్రమైనటువంటి ఆందోళన గురవుతున్నారు. దీని వలన



పేద రైతులు మా భూములు పోవడం వల్ల మేము జీవించేది ఎట్లా బ్రతికేది ఎట్లా అని మనం ఏదైనా గురవి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆలోచించి పేద రైతులకు భూములు జోలికి రావద్దని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పేదల పొట్ట కొట్టొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా 90% రైతులకు చిన్న సన్నకారు రైతులు త్రిబుల్ ఆర్ అలైన్మెంట్లో తమ భూములను కోల్పోతున్నారన్నారు కాబట్టి పాత అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిచో రైతులను సమీకరించుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు రైతులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని రైతుల పక్షాన పోరాడి సాధించేవరకు ఈ పోరాటాన్ని వదిలే ప్రసక్తి లేదని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ రైతు సంఘం నాయకుడు కానుగుల వెంకటయ్య గ్రామ రైతులు పోగుల భీమయ్య కృష్ణారెడ్డి బాలరాజు గౌడ్ కృష్ణయ్య గౌడ్ గోవర్ధన్ గౌడ్ రంగయ్య జంగయ్య శ్రీనివాస్ రెడ్డి చెన్నారెడ్డి బుచ్చిరెడ్డి వెంకటరెడ్డి బాలయ్య రాములు యాదగిరిరెడ్డి సత్యనారాయణ శ్రీనివాసులు రామ్ రెడ్డి మల్లయ్య సాయిలు దామోదర్జంగయ్యచంద్రయ్య సత్యం మహేష్ శ్రీను పాల్గొన్నారు.

---

# కేసీఆర్ గారి అధ్యక్షతన ఉప ఎన్నికల సన్నాహక సమావేశం

**• కేసీఆర్ గారిని,కేటీఆర్ గారిని కలిసిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి • 274 నుండి 282 వరకు ఉన్న 9భూత్ లకు ఇంచార్జిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో,బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు కొరకు బీఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అధ్యక్షతన ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సన్నాహక సమావేశంలో కేసీఆర్ గారిని,మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారిని మాగంటి సునీతమ్మతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి.ఈ సమావేశంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తో పాటు పార్టీ సీనియర్ నేతలు,మాజీ మంత్రులు,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు,మాజీ చైర్మన్లు,పార్టీ సీనియర్ నేతలు,ముఖ్య నేతలు,స్థానిక కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల,క్లస్టర్ల ఇంచార్జులు తదితర పార్టీ కీలక నేతలు హాజరయ్యారు.

---

# బంగారం రేట్లు ఆకాశాన్నంటడంతో విశ్వబ్రాహ్మణుల జీవనాధారం కరువైపోయింది

**- ఆవేదనతో మాట్లాడిన పత్తిపాటి సుధాకర్ చారి**

**తాతల తండ్రుల కాలం నుంచీ వస్తున్న వృత్తి ఇప్పుడు నిలదొక్కుకోలేక పోతున్నాం**

**"బంగారం ధర పెరగడం, కార్పొరేట్ దుకాణాల ప్రవేశం - మా పొట్టకూటికి రెండు దెబ్బలు"**

**"గిరాకీ లేక షాప్ వెలవెలబోతోంది, కిరాయి కట్టడమే కష్టమైపోయింది" అని చారి ఆవేదన**

**"విశ్వబ్రాహ్మణులం అంటారు కానీ బతకడమే కష్టంగా మారింది" - మనసుని తాకే మాటలు**

**ప్రభుత్వం చిన్న వ్యాపారులను ఆదుకోవాలని విజ్ఞప్తి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 23:** నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని విశ్వబ్రాహ్మణ వృత్తికి చెందిన పత్తిపాటి సుధాకర్ చారి మాట్లాడుతూంటే ఆవేదన అక్షరాలుగా వినిపించింది."మా తాతల తండ్రుల కాలం నుంచీ వస్తున్న ఈ పనినే మేము జీవనోపాధిగా చేసుకుంటున్నాం. ఇది మా వృత్తి మాత్రమే కాదు, మా ఆత్మగౌరవం. ఎన్నో ఏళ్లుగా ఈ పనినే ఆధారంగా చేసుకుని మా కుటుంబం బతుకుతోంది," అని అన్నారు."కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బంగారం రేట్లు ఆకాశాన్నంటడంతో ప్రజలు కొనుగోలు చేయడమే మానేశారు. మా దగ్గరకి గిరాకీ రావడం లేదు. రోజురోజుకూ షాప్ వెలవెలబోతుంది. కిరాయి కట్టడానికీ చేతులు కాలిపోతున్నాయి," అంటూ ఆయన మనసు విప్పారు.అంతేకాదు, ఆయన ఆవేదన కొనసాగిస్తూ ౧ "పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు రంగప్రవేశం చేయడంతో మేము చిన్న వాళ్లం కనపడకుండాపోతున్నాం. మేము విశ్వబ్రాహ్మణులం అంటారు కానీ ఈ రోజుల్లో ఆ పేరు ఉన్నా బతకడమే కష్టంగా మారింది. మా వృత్తి క్రమంగా కరిగిపోతున్న బంగారంలా కనుమరుగవుతోంది," అని చారి కన్నీటి గళంలో చెప్పారు.చిన్న వ్యాపారులు బతకడానికీ, తమ వారసత్వ వృత్తిని కాపాడుకోవడానికీ ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు."బంగారం రేటు పెరగడం కేవలం మార్కెట్ వ్యవహారం కాదు. అది మా తరాల వారసత్వాన్ని, మా జీవనాధారాన్ని బూడిద చేస్తోంది. చిన్న వ్యాపారి బ్రతికితేనే ఈ ఊరికి వెలుగుంటుంది" అని సుధాకర్ చారి గుండె నిండా చెప్పారు.



---

# అనునిత్యం ప్రజాసేవలో నరేందర్ రెడ్డి

**• ప్రజాసేవ కె తన జీవితం అంకితం • ఆదర్శ గ్రామం దిశగా కంసాన్ పల్లి గ్రామం • సూర్యుడివో చంద్రుడివో ఆ ఇద్దరి కలయికవో • సారథివో వారధివో మా ఊరు కన్న కలవో అంటూ హర్షం వ్యక్తం చేస్తున్న కంసాన్ పల్లి గ్రామస్తులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** అనునిత్యం ప్రజహితం కొరకు పరితపిస్తూ నిత్యం ప్రజలతో మమేకమై వారికీ ఏ కష్టం వచ్చిన తన కష్టంగా భావించి కుటుంబ సభ్యుని వలే ముందుండి సేవా చేసే గుణం మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి సొంతం. తాను ఎంపీటీసీ గా, గ్రామ సర్పంచ్ గా ఉండి కంసాన్ పల్లి గ్రామాన్ని అభివృద్ధి పథం లో ముందుకు తీసుకెళ్లి గ్రామస్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. గ్రామం లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు, బోరు మోటర్లు, ఎలక్ట్రిక్ వైర్లు ఒకటా, రెండా చెప్పుకుంటూ పొతే కొకల్లాలు ఇలా అన్ని పనులు చేయించి కంసాన్ పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దారు. అంతేకాకుండా గ్రామం లో ఏ ఇంటిలో పెండ్లి శుభకార్యం జరిగిన ఆడపిల్లలకు తన తోబుట్టువుల భావించి వారికీ పుస్తెలు, మెట్టలు మరియు ఎదో రూపంలో ఇతర సహాయాసహకారాలు అందిస్తూ సొంత అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా తన కర్తవ్యాన్ని నిర్వహించడం ఆయనకే చెల్లింది. అంతేకాకుండా ఎవరికీ ఏ ఆపద వచ్చిన అన్న అంటే వెంటనే స్పందించి వారికీ ఆర్థికంగా సహాయం అందిస్తూ అందరి మన్నలని పొందుతూ వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన పుట్టిన ఊరికి తనవంతు గా ఎదో చేయాలనీ కుతుహలంతో, మమకారం తో షాద్ నగర్ నియోజకవర్గం లో ఏ నాయకుడు చేయనటువంటి సాహసం చేసి చూపించాడు మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి.గ్రామం లో తన సొంత ఖర్చులతో గ్రామం మొత్తం లో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గ్రామం లో ఎలాంటి అక్రమాలు, అవంచనియా సంఘటన లు జరగకుండా చూడడమే తన లక్ష్యం గా పని చేయడం జరిగింది.నియోజకవర్గం లోనే కంసాన్ పల్లి గ్రామాన్ని అభివృద్ధి పథం లో నడిపి ఆదర్శ గ్రామం గా చేయడమే తన లక్ష్యంగా పని చేస్తున్నాడు.ఇటువంటి నాయకుడు దొరకడం కంసాన్ పల్లి గ్రామం చేసుకున్న అదృష్టం గా భావించొచ్చు. పదవిలో ఉన్న లేకున్నా గ్రామానికి తన సహాయాసహకారాలు ఎల్లప్పుడూ అందిస్తూ ప్రజాసేవ కె తన జీవితం అంకితం చేస్తూ ముందుకు సాగుతున్న నరేందర్ రెడ్డి దాత్రుత్వానికి హ్యాట్సాఫ్.



---

# చిన్న గూడూరు మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన





**తొలి అక్షరం/చిన్నగూడూరు అక్టోబర్ 23:** జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్లి చిన్న గూడూరు కె.జి.బి.వి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ సెంటర్ ను, ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కె.జి.బి.వి, జిల్లా పరిషత్ పాఠశాలలను పరిశీలించి, విద్యార్థుల సంఖ్య, పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, కిచెన్ షెడ్, స్టోర్ రూంను పరిశీలించి వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. తాజా కూరగాయలను మాత్రమే వాడాలని, అన్ని సరుకులు తగు పరిమాణం లో ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం భోజన తయారీ ఉండాలన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలని, విద్యార్థుల యొక్క సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అన్నారు. పాట్యాంశాలలోని పలు అంశాలపై ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల సంఖ్య వంటి వివరాలను అంగన్వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వడ్డించే భోజనం పరిశుభ్రంగా ఉండాలని, చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అటెండెన్స్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాలు, నిలువ చేసే ఫ్రీజర్స్, వ్యాక్సిన్ నిల్వ పద్ధతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మందుల రికార్డులను పరిశీలించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పాటశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, పి.హెచ్.సి వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బాలల భద్రత మరియు మానవ అక్రమ రవాణా పై అప్రమత్తంగా ఉండాలి

**● జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఏ సిద్ధార్థ రెడ్డి**





**తొలి అక్షరం/ములుగు అక్టోబర్ 23:** ములుగు జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూల్, బండారుపల్లి లో "బాలల భద్రత మరియు మానవ అక్రమ రవాణా నివారణ" పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్ర శిక్ష ములుగు ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రాజ్వలా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖాధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభలో ఉపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఉపాధ్యాయులు బాలల భద్రత మరియు మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని చెప్పారు. ఈ జ్ఞానం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తుంది అని డీఈఓ సిద్ధార్థ రెడ్డి పేర్కొన్నారు.అదేవిధంగా ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని తల్లిదండ్రుల సమావేశాలు మరియు యువజన చైతన్య కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు.శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త జి.సాంబయ్య , సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఈ కార్యక్రమం లక్ష్యాలను వివరించి, బాలల రక్షణ రంగంలో ప్రాజ్వలా ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో బాలల భద్రత, చట్టపరమైన అంశాలు, ఆన్‌లైన్ భద్రత, మరియు పాఠశాలల్లో సురక్షిత వాతావరణం సృష్టించడం వంటి అంశాలపై నిపుణులు చర్చించడం జరిగింది. ప్రాజ్వలా ఫౌండేషన్ నిపుణులు వివిధ చర్చలు, పాత్రాభినయాలు, ఉదాహరణల ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా 40 మంది హైస్కూల్ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. పాల్గొన్న ఉపాధ్యాయులు ఈ శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉందని, దీనివల్ల విద్యార్థులను మరింత సురక్షితంగా మార్గనిర్దేశం చేయగలమని అభిప్రాయపడ్డారు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఈ సూర్యనారాయణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దేవకిదేవి తో పాటుగా రిసోర్స్ పర్సన్లుగా కృష్ణ మరియు ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు సంజీవులు రాము మరియు జిల్లాలోని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది...

# తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తాం : కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నాగార్జునసాగర్ ఎడమ కాలువలో తండ్రిని,అన్నను కోల్పోయిన నిత్య**

**పున్న నిత్యకు 5 లక్షల చెక్కు అందజేత**

**కష్టపడి చదివి పలువురికి ఆదర్శంగా నిలవాలి అని సూచించిన కలెక్టర్**

**తొలి అక్షరం కథనానికి స్పందించిన అధికార యంత్రాంగం**



**తొలి అక్షరం/మిర్యాలగూడ/ అక్టోబర్ 23:** వేములపల్లి మండల కేంద్రంలో గత నెల సాగర్ ఎడమ కాలువలో వినాయకుని నిమజ్జనం చేసి ఆగి కాళ్లు కడుక్కుంటున్న సమయంలో చిన్నారి యొక్క తండ్రి అన్న ఇద్దరు సాగర్ ఎడమ కాలువలో మృతిచెందిన సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా అనాధగా మారిన బాలిక మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యను అనుసరిస్తున్న పున్న నిత్య కు ప్రభుత్వం అందించిన రూ. 5 లక్షల చెక్కును వేములపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులను అన్నను కోల్పోయి అనాథ బాలికతో మాట్లాడి వారి విద్య, జీవన విధానం తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తున్నామని అన్నారు. కష్టపడి చదివి జీవితంలో నిలదొక్కుకోవాలని, పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. చెడు ఆలోచనలు చేయవద్దని, మంచి మార్గాల్లో పయనించాలని సూచించారు. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని బాలికకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, మండల తాసిల్దార్ హేమలత, మాడుగులపల్లి మండల తాసిల్దార్, డిటి కోటేశ్వరి, ఆర్ఐలు, జిపిఓలో, ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గోరక్షకులపై ఎంఐఎం దాడికి వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎంఐఎం గుండాల పైన వెంటనే చర్య తీసుకోవాలి**




**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** గోరక్షకులపై ఎంఐఎం నాయకుడు దాడి చేసిన ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించడం బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ దాడి గోమాతను కాపాడే హిందువుల మనసును దెబ్బతీసిందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆధ్వర్యములో డీజీపీ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమములో వేలాది మంది బీజేపీ నాయకులు కార్యకర్తలు పార్టీ సీనియర్ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గారు పాల్గొన్నారు. శాంతి యుతముగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ "గోమాత రక్షణ కోసం కృషి చేసే గోరక్షకులపై దాడి చేయడం రివాల్వర్ తో కాల్చడం రాష్ట్రములో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పిందని అనడానికి నిదర్శనం అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయాల కోసం ఎంఐఎం గుండాల పైన చర్యలు తీసుకొని కారణముగా నిత్యం గోరక్షక్ కార్యకర్తలైన దాడులు జర్గుతున్నాయి అన్నారు .దాడి చేసిన ఎంఐఎం నాయకుడిని వెంటనే అరెస్ట్ చేయాలి. ప్రభుత్వం మెతక ధోరణి కొనసాగిస్తే బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు చేపడుతుంది" అని హెచ్చరించారు.గోరక్షణ రక్షణ కోసం బీజేపీ వెనకడుగు వేయదు. భయపడదు. హిందూ భావాలను అవమానించే వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు.

# కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**తొలి అక్షరం/ములుగు అక్టోబర్ 23 :**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో గోరక్షకుడు సోను సింగ్ (ప్రశాంత్) గోమాత రక్షణలో ఉండగా అక్రమ గోవుల రవాణా అడ్డుకోవడంతో తుపాకీతో ఎంఐఎం గూండాలు కాల్పులకు పాల్పడిన ఘటనపై ములుగు బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.ఈ ఘటనలో ప్రశాంత్ సింగ్ తీవ్రంగా గాయపడగా, ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ నగరపు రమేశ్ గారి ఆధ్వర్యంలో గురువారం ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి అనంతరం కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతు గోరక్షకుడిపై కాల్పులు జరిపిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, గోరక్షకుడికి ఉన్నత వైద్య సదుపాయాలు కల్పించాలని, రాష్ట్రంలో గోరక్షణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని బీజేపీ డిమాండ్ చేయడం జరిగింది,గోమాతను రక్షించే గోరక్షకులపై కాల్పులు జరగడం సనాతన ధర్మానికి



అవమానం, ప్రజాస్వామ్యానికి అవహేళన.రాష్ట్ర ప్రభుత్వం గోరక్షణ చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది.గోరక్షకులను రక్షించాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. నిందితులను వెంటనే అరెస్టు చేసి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, నాయకులు మరోసారి పేర్కొన్నారు "బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచందర్ రావు ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడానికి వెళ్తుండగా, పోలీసులచే అక్రమంగా అరెస్టు చేయడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధ చర్య. దీనిని బీజేపీ తీవ్రంగా




ఖండిస్తుంది."బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ,రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఒక వర్గానికి తొత్తులుగా మారి, తెలంగాణలో గన్ కల్చర్‌కు ప్రోత్సాహం ఇస్తోంది. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని కాపాడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు," అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయం సాధించే వరకు బీజేపీ ఆందోళన కొనసాగుతుందని ములుగు జిల్లా బీజేపీ ప్రకటించింది. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్యా జవహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షులు, భర్తాపురం నరేష్, అల్లే శోభన్, రవి రెడ్డి మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, ఇమ్మడి రాకేశ్ యాదవ్ యాద సంపత్ , సతీష్ వావిలాల జనార్దన్, రెడ్డి శ్రీనివాస్, కాసర్ల సురేశ్, శ్రీహరి, శ్రీనివాస్, కళ్యాణ్, లాకావత్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

**● మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్...**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 23:** రామన్నపేట జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పనున్నారని, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేతలతో బాండ్ పేపర్ లపై ఆరుగారంటీ హామీలు ఇచ్చి ఒక్క గ్యారంటీని కూడా అమలు చేయని, విమర్శించారు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో సమాధానం చెప్పనున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేద ప్రజల ఇండ్లను కూల్చిందే తప్ప సాధించిందేమీ లేదన్నారు. పేదల పక్షాన నిలబడే బిఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు ఘననీయంగా పెరిగిందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి గుణపాఠం చెప్తారని అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి పాటుపడిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారని, తెలంగాణ రాష్ట్రం మొత్తం అభివృద్ధి నోచుకోలేదని ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా తట్టెడు మట్టి పోయలేదు పూర్తి స్థాయిలో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది ప్రజలు మొత్తం బిఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నారని, బద్దల ఉమా రమేష్ యాదవ్ అన్నారు.

# కాపాస్ కిసాన్ యాప్ – పత్తి రైతుల కోసం ముఖ్య సూచనలు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 23:**రైతులందరూ తమ పత్తి దిగుబడిని సరైన ధరకు విక్రయించుకోవడానికి "కాపాస్ కిసాన్ యాప్" ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. **ముఖ్య సూచనలు:** పత్తి పంట నమోదు:రైతులు తమ పత్తి పంటను తమ మండలానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణాధికారితో నమోదు చేయించుకోవాలి. మొబైల్ నంబర్ ఆధార్‌కి లింక్ అయి ఉండాలి:ఆధార్‌తో అనుసంధానం కాని మొబైల్ నంబర్ ఉంటే వెంటనే లింక్ చేయించుకోవాలి. బ్యాంక్ ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉండాలి:రైతుల బ్యాంక్ ఖాతా ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవడం ద్వారా మద్దతు ధర చెల్లింపు నేరుగా మీ ఖాతాలో జమ అవుతుంది.యాప్ డౌన్‌లోడ్:మీ ఆండ్రాయిడ్ మొబైల్‌లో "కాటన్ కాపస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేయండి.యాప్ లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్:రైతు నమోదు పూర్తయిన తరువాత, జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ చేయాలి.అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోండి:రైతు ఆధార్ నంబర్ పట్టాదారు పాస్ బుక్. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్పత్తి నాణ్యత పరామితులు పాటించండి:పత్తి తేమ శాతం (మాచర్) 8% లోపు ఉండేలా చూసుకోవాలి, తద్వారా మద్దతు ధర (ఎం ఎస్ పి) పొందగలుగుతారు.ఏజాజ్ అలీ ఖాన్వ్యవసాయ అధికారి, రామన్నపేట

# జూబ్లీహిల్స్‌లో దోశలు వేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కృష్ణానగర్ బి బ్లాక్ పరిధిలో ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" ప్రచారం**

**కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** గరం గరం "దోసెయ్" అంటూ వేడి వేడిగా కారం దోశలు వేశారు షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్. జూబ్లీహిల్స్ లో ఉప ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా కృష్ణానగర్ బి బ్లాక్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారంలో గురువారం పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజవర్గ పరిధిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఓ టిఫిన్ సెంటర్ వద్ద స్వయంగా ఆగి ఎమ్మెల్యే శంకర్ వేడివేడిగా కారం దోషలు వేశారు. అదేవిధంగా మరోకట్టులో బట్టలను ఇస్త్రీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలిపించాలని కృష్ణానగర్ బి బ్లాక్ ప్రజలను ఎమ్మెల్యే అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అదేవిధంగా ప్రభుత్వ భవిష్యత్తు లక్ష్యం వాటిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపిస్తే నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ప్రచారం సందర్భంగా పెద్ద ఎత్తున ఆయన అభిమానులు స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొనడంతో ప్రచారం హోరెత్తించారు. ఎమ్మెల్యే స్వయంగా ఓటర్లను ఆకట్టుకోవడంతో స్థానికులు సంబరపడ్డారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డిఎం హరికృష్ణ



**తొలి అక్షరం:వలిగొండ, అక్టోబర్, 23:** వలిగొండ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిగురువారం డీఎం హరికృష్ణ పరిశీలించారు వడ్ల కాంట తూనికలను దగ్గరుండి పర్యవేక్షించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు ఇంకా రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా నేరుగా మార్కెట్ కు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఆయన కోరారు ఇంకా రైతుల నుండి కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుందని కూడా నేరుగా అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీలో తండ్రికి మించిన తనయురాలు కనుకు సిరి చందన



**తొలి అక్షరం/వలిగొండ అక్టోబర్, 23:** కరాటే లో బ్లాక్ బెల్ట్ అయినా కనుక రాజు, తన ముగ్గురు పిల్లలు కూడా, కరాటే జూడో పోటీలో పాల్గొని, మోత్కూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో, ఉమ్మడి నల్గొండ జిల్లా, 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్, నిర్వహణలో భాగంగా, రాష్ట్రస్థాయికి ఎంపిక అయిన, కనుక సిరి చందనను, కోచ్ అన్నపు వెంకటేశం, ఆధ్వర్యంలో, ఎందరో విద్యార్థిని విద్యార్థులను, రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం వలన, అతనితోపాటు, విద్యార్థిని సిరి చందన ను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఆమెను సన్మానించి, మోత్కూర్ మున్సిపాలిటీకి, మంచి పేరు తేవాలని కొనియాడారు, రాష్ట్రస్థాయిలో తో పాటు దేశ లెవెల్ లో ఎదగాలని కొనియాడారు.

# కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే తప్ప

**- రైతులకు చేస్తుంది శూన్యం అంటూ**

**వైసీపీ ప్రజాప్రతినిధులు ఎద్దేవా**

**తొలి అక్షరం/ఉరవకొండ అక్టోబర్ 23:-** విడపనకల్ మండల కేంద్రంలోనున్న ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కరణం పుష్పావతి భీమరెడ్డి అధ్యక్షతన,ఇన్చార్జ్ ఎంపీడీవో సత్యబాబు ఆధ్వర్యంలో గురువారం సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రైతులు సమస్యలపై వాడి వేడిగా చర్చ సాగింది.రబీ సీజన్ ఆరంభమైనప్పటికీ సబ్సిడీపై పప్పుశనగ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదంటూ అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు.ఈ ప్రక్రియపై ప్రభుత్వం నుంచే ఎటువంటి సమాచారం లేదన్న వ్యవసాయ అధికారి.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హనుమంతు,ఏవో భాస్కర్,వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత,డిప్యూటీ తాహసిల్దార్ చంద్రశేఖర్ మరియు వివిధ శాఖ అధికారులు,పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.